ప్రజాశక్తి
సోమవారం 28 నవంబర్ 2022 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

మూఢనమ్మకాల నిరోధక

చట్టాన్ని తీసుకొచ్చేందుకు కృషి

పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ

ప్రజాశక్తి-పొదిలి

మూఢ నమ్మకాలను రూపు మాపేందుకు, శాస్త్రీయ సమాజం ఏర్పాటుకు అవసరమైన మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తూర్పు రాయలసీమ పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. ఖాజాహుస్సేన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాలకులు తమ విధానాలు, అవినీతి అక్ర మాలను ప్రజలపై రుద్దేందుకు మూఢ నమ్మకాలు ఎంతగానో దోహద పడుతు న్నాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో జెవివి పాత్ర కీలకమన్నారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు కె.స్వరూపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు, ప్రశ్నించే తత్వాన్ని, హేతుబద్ధమైన ఆలోచనలు కలిగించేందుకు గత 35 సంవత్స రాలుగా జెవివి కషి చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో వివిధ స్థాయిల్లో చెకుముకి సైన్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. జయప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులలో సజనాత్మకత శక్తిని పెంపొందించేందుకు, శాస్త్రీయ జీవన విధానం అలవాటు చేసేందుకు జెవివి ఆధ్వర్యంలో విద్యార్థి చెకుముకి మాసపత్రికను ప్రచురిస్తున్నట్లు తెలిపారు. రూ.300 చెల్లించి సంవత్సర చందాదారులుగా చేరాలని కోరారు. డిసెంబర్ 11న పొదిలిలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సంబరాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి మాట్లాడుతూ జిల్లా స్థాయి

2లో

మద్య నిషేధం ఎప్పుడు..?

- మండలానికి 200లకు పైగానే బెల్టు షాపులు
- పేదల కూలి నాలి డబ్బంతా మద్యానికే ఖర్చు



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

– దశలవారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తాం. ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్షనేత. ప్రస్తుతం సిఎంగా ఉన్న వైఎస్ జగన్ మాటలు ఇవీ.

–మండలంలో 210 బెల్టుషాపులు ఉన్నాయని,వాటి నుంచి ఎస్ఐ నెలకు రూ.5వేల చొప్పున రూ.10.50 లక్షలు లంచం తీసుకుంటున్నాడని ముండ్లమూరు మండల ఎంపిపి, జడ్‌పిటిసి బహిరంగంగా చెప్పిన మాటలు ఇవీ.

– ఇటీవల మద్దిపూడి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన మహిళలు ఊళ్లో బెల్టుషాపులుఎత్తేయాలని కోరుతూ ఒంగోలు–కర్నూలు రహదారిపై బైఠా యించారు.గంటసేపు ఆందోళన చేపట్టారు. పోలీసులు వచ్చి వారిని సము దాయించి ఆందోళన విరమింపజేశారు.

ఇలా మండలంలో పాతిక గ్రామాలుంటే ఒక్కో గ్రామంలో ఎన్ని బెల్టుషాపులున్నాయో చెప్పాల్సిన అవసరం లేదు. ఇపుడు అన్ని చోట్లా మద్యం అమ్ముతున్నారు. వీధికి నాలుగు దుకాణాలు ఉంటున్నాయి. పాలకపక్షం నేతల ప్రసన్ననం ఉంటేచాలు. ఎవరూ పట్టుకోరు. బంకులు, బడ్డీకొట్లు, కూల్‌డ్రింక్ షాపులు ఇపుడు బెల్టు షాపులుగా మారిపోయాయి. విచ్చలవిడిగా బాటిళ్లు దొరుకుతాయి.ఎక్కడో మండల కేంద్రంలో ఉన్న మద్యం దుకాణానికే వెళ్లాల్సిన అవసరం కూడా లేదు.

మద్యం ఊళ్లలో ఏరులై పారుతోంది. యువత మద్యం మత్తులో చిందేస్తున్నారు. జీవితాలు బుగ్గి చేసుకుంటున్నారు. రోజంతా కష్టపడి కూలినాలి చేసుకున్నా ఆ డబ్బు ఇంటికి చేరడం లేదు. మద్యం దుకాణాలకే చేరుతోంది. అందుకు బెల్టు దుకాణాలే కారణం. మద్యం షాపులను ప్రభుత్వమే నడుపుతోంది. వాటి నుంచి మద్యం తీసుకుపోయి ఊళ్లలో అమ్ముతున్నారు. ఇదంతా బహిరంగ వ్యవహారమే. ఏదీ దాపరికం లేదు. ఈ దందాలో ఎవరిదారిని వాళ్ళు ముడుపులు దండుకుంటారు. మద్య పాన నిషేదం ఎక్కడ? ఎప్పుడు? అనేదే ఇపుడు తలెత్తుతోన్న ప్రశ్న. నాలుగో ఏడాదిలో పాలన సాగుతోంది. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు చెప్పిన మాటలు సిఎం అయ్యాక అమలు చేయాలా? లేదా;? అన్నదీ ఆలో చించాలి. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానంలో కీలకమైంది. మహిళలు ఎప్పటి నుంచో దీనికోసం ఎదురు చూస్తున్నారు. దీన్ని మాత్రం అమలు చేయడంలేదు. పాలకపక్ష నేతలే మండలాల్లో కడుపు మండి కొందరు బెల్టు షాపులపై ధ్వజమెత్తుతున్నారు. పోలీసులు వీటి నుంచి ఎలా దండు కుంటున్నారో

2లో

వర్షమొస్తే ముంపే

- డ్రెయినేజీ లేక అవస్థలు
- మురుగునీటితో తిప్పలు
- పట్టించుకోండి ప్రజాప్రతినిధులు
- ఇది అప్పాపురం గిరిజన కాలనీ వాసుల దుస్థితి



వర్షపు నీటితో ముంపునకు గురైన అప్పారావు గిరిజన కాలనీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

వర్షం పడినప్పుడల్లా నీరు ఇళ్లల్లోకి చేరడంతో ఆ కాలనీ వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆ సమయంలో అధికారులు, నాయకులు హామీ ఇవ్వడం తప్ప సమస్య పరిష్కారం కావడం లేదు. వర్షం పడితే పరిస్థితి షరా మాములే.. శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి పంచాయతీపరిధిలోని అప్పాపురం గిరిజన కాలనీ వాసుల దుస్థితి ఇది.

అప్పాపురం గిరిజన కాలనీలో 150 గహాలు ఉన్నాయి. అక్కడ దాదాపుగా అన్ని పూరి గుసెలే. వారు రోజంతా కష్టపడితేనే పూట గడిసేంది. లేకుంటే పస్తులే. తమ బతుకుల్లో వెలుగులు వస్తాయని ప్రతిరోజూ అనుకుంటారు. కాని వారి సమస్య మాత్రం తీరడం లేదు. గత్యంతరం లేక మురుగునీటితోనే సహజీవనం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వరుస వర్షాలకు కాలనీ పరిస్థితి అధ్వానంగా తయారైంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించు కోవటం లేదని గిరిజనులు వాపోతున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రూలర్‌అర్బన్ పథకం కింద గిరిజన కాలనీలో సిమెంట్ రోడ్లను నిర్మించారు. సిమెంట్ రోడ్డును నిర్మించిన అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు సైడు కాలువల నిర్మాణం మర్చిపోయారు. దీంతో గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. సైడు కాలువలు లేకపోవడంతో వర్షపు నీటితో కలిసి మురుగు నీరు రోడ్లపై పారి ఇళ్లలోకి చేరుతోంది. కాలనీలోని గుడిసెలన్నీ లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. దీంతో వర్షం పడినప్పుడల్లా ఆ కాలనీలోకి నీరు చేరుతోంది. కలిపి మురుకునీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో గిరిజన కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు అధికారులు వచ్చి హడావుడిగా నీటిని పక్కకు మళ్లిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కొన్ని సంవత్సరాలుగా గిరిజన కాలనీవాసులు వేడుకుంటున్నారు. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. ఇటీవల సోమరాజు పల్లి వచ్చిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు అప్పాపురం గిరిజన కాలనీ దుస్థితి గురించి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాపూరి ప్రభావతి వివరించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. వర్షం పడినప్పుడల్లా ప్రజలు నీటిలోనే నడుస్తునారు. సమస్యను జిల్లా కలెక్టర్ దష్టి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడం పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

స్కూల్ గేమ్స్‌కి నిధులేవీ..?

ఉపాధ్యాయులపై ఆర్థిక భారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీయడమే లక్షంగా చెప్పుకుంటున్న ప్రభుత్వం గత నెల 17 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించింది. అయితే వాటి నిర్వహణకు పైసా కూడా ఇవ్వకుండానే పోటీలు నిర్వహించాలని ఆదేశా లిచ్చింది. తప్పని పరిస్థితుల్లో వ్యాయామ ఉపాధ్యాయులు మండలాల వారీగా పోటీలు నిర్వహించి, నియోజకవర్గ పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే క్రీడాకారులకు కనీసం భోజనాలు, ఆట పరికరాలు కూడా ఇవ్వకుండా ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎలా వెలికి తీస్తారో పాలకులే చెప్పాలి డబ్బులు ఇవ్వకుండా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు నిర్వహిస్తుంచడంపై వ్యాయామ ఉపాధ్యా యులు ఆందోళన చెందుతున్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఆటల పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రయాణ ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. పోటీలకు అవసరమైన క్రీడా కోర్టుల ఏర్పాటుకు, పరికరాలకు గాని అయ్యే ఖర్చులన్నీ ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు) భరిస్తున్నారు. గతంలో సిఎం కప్ ఆటల పోటీలకు నిధులిచ్చిన ప్రభుత్వం ఈ పోటీల నిర్వహణకు ఏమాత్రం కేటాయించకపోవడం క్రీడాకారులను ఉపాధ్యాయులను విస్మయానికి గురి చేస్తోంది.

పాఠశాల స్థాయిలో..

పాఠశాల స్థాయిలో క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కూల్ గేమ్స్

2లో

రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు అమ్ముకుంటున్న వైనం ● చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పంగులూరు

'రైతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద నడుస్తుంది' అన్న సామెతను నిజం చేస్తున్నారు రెవెన్యూ అధికారులు. కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలం, ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు వాడుకుంటున్నా, ఆ స్థలాలను అమ్ముకొని లక్షలాది రూపాయలు సొమ్ము చూసుకుంటున్నా, తమకేమీ పట్టదన్నట్లుగా అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకొని భూమి రకరకాల చేతులు మారి, దళారులకు కాసులకు వర్షం కురిపిస్తోంది. జాగా వేసుకునేందుకు సెంటు స్థలం లేక, మండలంలో అనేకమంది అర్హతలు ఉన్న పేదలు, స్థలాలు ఇవ్వండి బాబు అంటూ, ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోగా, ఉన్న స్థలాలు మాత్రం కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని విలవిలాడుతుంటే, కనీసం మాట మాత్రం కూడా అనకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

మండలంలోని కొండమంజులూరు గ్రామ సమీపాన గల, జాతీయ రహదారికి కుడివైపున సర్వే నెంబరు 58లో, రెండు ఎకరాలు 42 సెంట్లు, డొంక పోరంబోకు భూమి ఉంది. ఇది జాతీయ రహదారిని ఆనుకుని పడమర వైపున ఉంది. ఈ భూమికి ఉత్తరం వైపున మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామం, సరిహద్దు కాగా, అక్కడ నుంచి దక్షిణం వైపునకు ఉంది. ఈ భూమిలో కొంతమంది టీ స్టాల్స్, నిర్మించుకోగా కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ భూమి విలువ ఎకరాకు రెండు కోట్ల రూపాయల వరకు ఉంది. మొత్తం సుమారు ఐదు కోట్ల రూపాయల వరకు ధర పలుకుతోంది. అయితే ఈ భూమి మొత్తం అన్యాక్రాంతం అయ్యింది. రకరకాల వ్యక్తులు భూమిని స్వాధీనం చేసుకొని, అనుభవిస్తున్నారు. ఇటీవల ఒక వ్యక్తి పది సెంట్ల భూమిని, ఆ స్థలం తనదైనట్లు, మరో వ్యక్తికి మూడు లక్షల 70 వేల రూపాయలకు అమ్మినట్లు తెలిసింది. దీన్ని స్టాంప్ పేపర్ మీద రాసుకున్నట్లు కొంతమంది చెబుతున్నారు. ఈ విధంగా ప్రభుత్వ భూమిని ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ల అమ్ముకోవటం, కొనుగోలు చేయడం జరుగుతున్నా, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు ఉంటున్నారు. అధికారులు ఇప్పటికైనా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా వరి కోతలు

ప్రజాశక్తి-రేపల్లె: వానకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంట దిగుబడులు చేతికొచ్చాయి. రేపల్లె మండలం వ్యాప్తంగా ఈ యేడు వానకాలంలో సుమారు 44 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వర్షాలు సకాలంలో పడటం, వాతావరణం అనుకూలించటంతో ఈ ఏడాది వరి సాగుకు అనుకూలంగా మారింది. దీంతో ఈసారి వరి సాగు విపరీతంగా పెరిగింది. కాలువలు, బోర్ల కింద సైతం సాగయ్యింది. ఈ వర్షాకాలంలో వానలు సైతం సమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. ఆరుగాలం శ్రమించి రైతన్నలు వరి సాగు చేయగా.. ఇప్పుడిప్పుడే పంట దిగుబడులు చేతికి అందుతున్నాయి. నాలుగైదు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి కోతలను ముమ్మరం చేశారు. హార్వేస్టర్లతో పంట కోతలు చేస్తుండగా.. గంటకు రూ.1900 చెల్లిస్తున్నారు. ఇంకొందరు రైతులు వడ్లను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈసారి వరి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

అద్దేపల్లి పైపు లైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలులోని అద్దేపల్లి గ్రామానికి వెళ్లే తాగునీటి పైపు లైను దెబ్బతిని పగిలిపోవటంతో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. గతంలో వేసిన పైపులు నిరంతరం ఎక్కడికక్కడ పగిలిపోతున్నాయని, దీనివలన నిత్యం ఏదో ప్రాంతంలో పైపులు లీకేజీ అవుతున్నాయని, పగిలిపోతున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయ్యేంతవరకు అద్దేపల్లికి తాగునీరు అందించటంలో జాప్యం జరుగుతోందని, ప్రజలు గమనించి సహకరించాలని ఆమె కోరారు.



పైపులైను పనులు చేస్తున్న సిబ్బంది

స్కూల్ గేమ్స్‌కి నిధులేవీ..?

(మొదటి పేజీ తరువాయి)

పేడరేషన్ జిల్లాలోని 38 మండల కేంద్రాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తోంది. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ తదితర తొమ్మిది క్రీడల్లో బాలబాలికలకు, పోటీలు జరుగుతున్నాయి. ఒక్కో క్రీడలో ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి పోటీలకు తీసుకురావాలి. వీటికి హాజరవుతున్న ఒక్కో విద్యార్థిపై రూ. వెయ్యి వరకు భారం పడుతోంది. ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు హాజరైన విద్యార్థులకు ఆ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పెడుతున్నారు.

బిల్లులు పెట్టుకుంటే ప్రభుత్వం ఇస్తుంది

సిహెచ్ సుబ్బారావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, ప్రకాశం జిల్లా



పాఠశాల స్థాయిలో జరిగే ఆటలు పోటీలకు వస్తున్న క్రీడాకారులకు ఆ పాఠశాలలో వండే మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నాం. ఫిజికల్ డైరెక్టర్లు టిఎ, డిఎ బిల్లులను పెట్టుకుంటే ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ప్రత్యేకంగా స్కూల్ గేమ్స్‌కి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

సైన్స్ పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని విజయవాడలోని డాక్టర్ లక్ష్మయ్య ఐఐటి నీట్ కళాశాల ప్రిన్సిపాల్ తోమాటి రవి అన్నారు. గుళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టెక్నికల్ సైన్స్ ప్రాజెక్టులను నిర్వహించారు. తోమాటి రవి ఆధ్వర్యంలో సైన్స్ ప్రాజెక్టులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో రివర్స్ గేర్, కార్ హారన్, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్, బాడీ వెల్నెస్ ఇండికేటర్ తదితర ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా చేయించారు. సైన్సు ప్రయోగాలకు 1986 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు. అనంతరం విజయవాడ నీట్ కళాశాల ప్రిన్సిపల్ తోమాటి రవిని పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులి లాజర్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సైన్స్ టీచర్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు నరేంద్ర, మోర్ల వెంకటేశ్వరరావు, నాంచారయ్య, తెనాలి అనుపమ, ఏ మాధవి కుమారి, బొర్రు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఈసీలో ఉత్సాహంగా ఎన్‌సిసిడే వేడుకలు

ప్రజాశక్తి-చీరాల

ఎన్‌సిసి డే వేడుకలు చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్సాహంగా జరిగాయి. ఎన్‌సిసి డే ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లు తమ అనుభవాలు, ఎన్‌సిసి వలన కలిగే లాభాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరటం ఆత్మవిశ్వాసానికి చిహ్నమని అన్నారు. ఎన్‌సిసి క్యాడెట్లు దేశభక్తితో, క్రమశిక్షణలో ముందుంటారని, ఏ విషయాన్ని అయినా సమర్థంగా చేయగలుగుతారని అన్నారు. ఎన్‌సిసిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇసి హెచ్ఓడి బషీర, భూమిరెడ్డి, ఎన్‌సిసి అధికారి హరీష్, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

మద్య నిషేధం ఎప్పుడు..?

(మొదటిపేజీ తరువాయి)

ముండ్లమూరు ఎస్ఐపై పాలకపక్ష నేతలు చేసిన ఆరోపణలే అద్దం పడుతున్నాయి. అన్ని మండలాలు. అన్ని గ్రామాల్లో ఇదే తంతునడుస్తోంది. మరోవైపు మద్యపాననిషేద కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటికీ జిల్లాకు చెందిన నేతను చైర్మన్‌గా పెట్టారు. ఈ కమిటీ మద్యపాన నిషేధం అమలు తీరును పరిశీలించేందుకు ఏర్పాటు చేశారు. అసలు మద్యపానం నిషేదం అన్నమాటే వినిపించడంలేదు. ఇటీవల బార్ల సంఖ్యను పెంచారు. కొత్తగా దర్శి వంటి ప్రాంతాలకు విస్తరింపజేశారు. చిన్నచిన్న పట్టణాల్లోనూ బార్లు బార్లా తెరిచారు. మద్యం దుకాణాల్లో సమయాల ప్రకారం అమ్మకాలు చేసినా గ్రామాల్లో మాత్రం నిత్యం దొరుకుతుంది. అర్ధరాత్రి కూడా మద్యం అందుబాటులో ఉంది. అనధికారిక బార్లు కూడా భారీగానే ఉన్నాయి. మండల కేంద్రాల్లో రెస్టారెంట్ల పేరుతో కొన్ని నడుస్తున్నాయి. వీటిల్లో మద్యం అమ్మకాలు పైకి కనిపించవు. బయట నుంచి తెచ్చుకుని తాగే అవకాశం పేరుతో అనుమతించారు. సంతనూతలపాడు సమీపంలో ఓ రెస్టారెంట్ ఉంది. దాంట్లో తాగుతూ తింటూ కిటకిటలాడు తుంటారు. ఇదంతా పోలీసులకు తెలిసే జరుగుతోంది. ఎవరి వాటాలు వాళ్లకు వెళతాయి. ఇలా మండలాల్లో రెస్టారెంట్లలో మద్యం తాగు తున్నారు. పాలకపక్ష నేతల అండదండలతో నిర్వాహకులు వీటిని నడుపుతున్నారు. సమీపంలోని మద్యం దుకాణాల నుంచి బాటిళ్లు కూడా రెస్టారెంట్లలో పనిచేసే కుర్రాళ్ళే తీసుకుని తెచ్చి ఇస్తారు. బార్లలో ఇలా మద్యం తాగుతుంటే ఊళ్లలోనూ పరిస్థితి ఎలా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. మండలానికి కనీసం 200లకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయి. జిల్లాలో ఎన్ని ఉన్నాయో విధితమవుతోంది. మద్యం కిక్ చాలడం లేదంటూ యువత గంజాయి కూడా వాడుతున్నారు. ఇటీవల చాలాచోట్ల గంజాయిని పట్టుకుంటున్నారు. గంజాయి గుట్టుగా అమ్మే ముఠాలు రంగంలోకి వచ్చాయి. యువతకు చేరవేస్తున్నారు. జీవితాలను గుల్లచేస్తున్న మద్యం, గంజాయిపై పాలకులు మెతక వైఖరిలోనే ఉన్నారు. ఆదాయం కోసమే చూస్తూ వదిలేస్తున్నారనడంలో సందేహం లేదు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తెచ్చేందుకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

సైన్స్ సంబరాలు పొదిలిలో నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. ఈ జెవివి పొదిలి డివిజన్ గౌరవాధ్యక్షులు కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కోశాధికారి యు.భాస్కర్, నాగార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు కె.రవి, డి.చంద్రశేఖర్, బి. దేవ ప్రసాద్, జి.ఐజాక్, ఆంజనేయ చౌదరి, జి.రమేష్, యు. వెంకట్రావు, నల్లూరి వెంకటేశ్వరరావు, షేక్ బషీరున్నీసా బేగం, రంగరాజు, జడ్. రమణయ్య, జి.శ్రీనివాసరెడ్డి, వై.రవి, రాగి సోమరాజు, వి.వెంకటేశ్వర్లు, యలమందరెడ్డి పాల్గొన్నారు.



రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి లలితకుమారి

రహదారికి రూ.3.90 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండల కేంద్రం భట్టిప్రోలు నుంచి పెసర్లంక వరకు గల రహదారి గుంతలు పడి ప్రయాణం ఇబ్బందిగా మారడంతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున ద్వారా రూ.3.90 కోట్లు నిధులు మంజూరు అయినట్లు ఎంపిపి దావురి లలితకుమారి తెలిపారు. ఆదివారం భట్టిప్రోలు పాత రైల్వే గేటు నుండి బిఎం డ్రైన్ వరకు రహదారి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రూ.28 లక్షల వ్యయంతో పూర్తిగా దెబ్బతిన్న ఈ ప్రాంతంలో ప్యాచ్ వర్క్ చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, మండల ఉపాధ్యక్షులు కె పిచ్చయ్య శాస్త్రి, ఆర్అండ్‌బి ఏఈ కష్ణారావు, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సిసిడేను పురస్కరించుకుని హెచ్ఎం కాటూరు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌సిసి కేర్ టేకర్ కనపర్తి దాదెమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని మహాత్మ గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాలకు హెచ్ఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌సిసి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పిడి శ్రీనివాసరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్‌సిసి విద్యార్థులు

పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు రాయని సుబ్బరామయ్య, తండ్రి తిరుపతి రాయుడు. మా స్వగ్రామం ఇంకొల్లు మండలం, దుద్దుకూరు. నేను ఈ నెల 25వ తేది శుక్రవారం దుద్దుకూరు నుండి ఇంకొల్లుకు టూవీలర్ పై వెళుతుండగా నా పాస్ పోర్ట్ పోయినది. ఎవ్వరికైనా దొరికిన యెడల దయచేసి ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఇట్లు.

రాయని సుబ్బరామయ్య,

తండ్రి తిరుపతి రాయుడు,

దుద్దుకూరు (గ్రామం), ఇంకొల్లు (మండలం),

బాపట్ల (జిల్లా), సెల్. 9618843224.

ప్రజాశక్తి
సోమవారం 28 నవంబరు 2022

టిప్పర్‌ను ఢీకొన్న అయ్యప్పల బస్సు

భక్తులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

అయ్యప్ప భక్తులతో శబరిమల వెళుతున్న బస్సు టిప్పర్ వెనుక ఢీకొన్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జాతీయ రహదారి పెళ్ళూరు లా కళాశాల ఎదురుగా చోటుచేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు 26వ తేదీ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం, డిఎస్‌పురం నుంచి 40 మంది అయ్యప్ప భక్తులతో బయలు దేరింది. రాత్రి ఒంటి గంట సమయంలో జాతీయ రహదారిపై పెళ్ళూరు గ్రామం లా కాలేజీ ఎదురుగా ముందువెళుతున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీనితో బస్సులో ప్రయాణిస్తున్న భక్తులకు స్వల్ప గాయాలయినట్లు తెలిపారు. అయితే ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అతివేగంగా వెళుతుండటంతో స్పీడ్ కంట్రోల్ కాక వెనుక నుంచి ఢీకొన్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను రిమ్స్ హాస్పటల్‌కు తీసుకువచ్చి వారికి చికిత్స చేసినట్లు తెలిపారు. బాధితులు రిమ్స్ ఔట్‌పోస్టు సిబ్బందికి బాధితులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఒంగోలు డిఎస్‌పి నాగరాజు



బెల్లం ఊట క్యాన్‌లతో అధికార బృందం

450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో ఆదివారం 450 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నామని బాపట్ల సెబ్ సిఐ సుంకర శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన దాడుల్లో స్టువర్టుపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేశామని అన్నారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.



క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బైకును కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కనుమళ్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కందుకూరు నుంచి వస్తున్న కారు మోటార్ బైకును ఢీకొంది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి, బైకుపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి.

ప్రేమికుల ఆత్మహత్య కేసును వేగంగా విచారించాలి

ప్రజాశక్తి-అద్దంకి

ఈ నెల 15వ తేదీన పట్టణ సమీపంలోని కాకానికుంట వద్ద జరిగిన ప్రేమికుల ఆత్మహత్య కేసు విచారణ వేగంగా జరపాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్ర పోలీసులను డిమాండ్ చేశారు. ఆ సంఘటనలో మృతి చెందిన బత్తుల పెద్దిరాజు ను ముందుగానే హత్య చేసి ఉరి వేశారని తమకు అనుమానంగా ఉందని, దీనిని పరువు హత్యగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సంఘటన జరిగి 15 రోజులు కావస్తున్నా విచారణకు అవసరమైన ఎటువంటి ప్రాథమిక సమాచారమూ పోలీసు డిపార్ట్‌మెంట్ వారు సేకరించలేదని అన్నారు. డిసెంబర్ 6 అంబేద్కర్ వర్ధంతి లోపు కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించరాలని, లేకుంటే ఆ రోజు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దారా అంజయ్య, జిల్లా అధ్యక్షుడు అద్దంకి నియోజకవర్గం మాల మహానాడు అధ్యక్షులు అంకం కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తుల రాజశేఖర్, అంకమ్మ రావు, అల్లాడి ఆంజనేయులు, శివశంకర్, ఈశ్వర్, చందు, నారాయణ పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న నీలం నాగేంద్ర

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

కుటుంబ సభ్యులు వేధిస్తున్నారంటూ పోలీస్ స్టేషన్ ఎదుట యువతి ఆవేదన

ప్రజాశక్తి-కనిగిరి: కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ ఓయువతి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటన కనిగిరి పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలు మిత్తికాల అశ్వని కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా పెగపల్లి మండలం లింగాపురం గ్రామానికి చెందిన అశ్వనికి కనిగిరి మండలం జమ్మలమడకకు చెందిన దుర్గాప్రసాద్‌తో గతంలో వివాహం అయ్యింది. వారికి 4 సంవత్సరాలు బాబు, రెండేళ్ల పాప ఉంది. వీరు తెలంగాణ, ఆంధ్రలోని పలుచోట్ల నివశించారు. వీరి మధ్య గత కొంతకాలం నుంచి కుటుంబ కలహాలు తలెత్తాయి. దీంతో కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు, దాడులను అశ్వని ఎదుర్కొనాల్సి వచ్చింది. భర్త కోసం తెలంగాణ నుంచి జమ్మలమడకకు వచ్చిన అశ్వనిపై భర్త దుర్గా ప్రసాద్, అత్తమామలు బాలకోటయ్య, ఎల్లమ్మ, మరిది కృష్ణప్రసాద్ ఇటీవల దాడి చేశారు. స్థానికులు 100కు సమాచారం అందించి క్షతగాత్రురాలు అశ్వనిని కనిగిరి వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు తనపై దాడులకు పాల్పడినట్లు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించు కోలేదని వాపోయింది. ఇప్పుడు కూడా స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదన్నారు. కుటుంబ సభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. లేదంటే పోలీస్‌స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వెలిబుచ్చింది.



స్టేషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు అశ్వని

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీ శివరాజ్‌నగర్‌కు చెందిన అనుమలశెట్టి శ్రీలక్ష్మి(31) చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దర్శిలోని వెలుగు ఆఫీసులో విఒఎగా పనిచేస్తున్న శ్రీలక్ష్మి తన ఇంటిలో ఆదివారం ఉరి వేసుకుని మృతి చెందిందని, భర్త సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కావూరు గ్రామంలో జరిగింది. చావలి గ్రామానికి చెందిన కొనిదన నాగరాజు(28) కబోర్డ్ పని నిమిత్తం చెరుకుపల్లి మండలం కావూరు వచ్చాడు. ఆదివారం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు గుళ్లపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా నాగరాజు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగరాజు మృతి పట్ల స్నేహితులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.



మృతిచెందిన నాగరాజు

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ చర్యలు శూన్యం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మేక్ ఇన్ ఇండియా ద్వారా నిరుద్యోగ యువతకు ఏటా 10 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తానని చెప్పి నరేంద్రమోడీ, బిజెపి 2014వ సంవత్సరంలో అధికారం చేజిక్కించుకున్నారని, నాటి నుంచి నేటికీ దేశంలో పేదరిక నిర్మూలనకు చేపట్టిన చర్యలు శూన్యమని జై భీమ్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కూకట్ల ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని పుట్టావారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కెవిఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఒర్సు శ్రీనివాసరావు అధ్యక్షతన సామాజిక న్యాయానికి, రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలిపెట్టుగా ఉన్న ఆర్థిక ప్రాతిపదికన రూపొందించబడిన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బీసీ సంఘం నాయకులు సన్నెబోయిన వెంకట్రావు మాట్లాడు తూ సామాజిక వెనుకబాటుతనం ఎస్సీ ఎస్టీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్ల ను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకులు బి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కారణంగా ఆయా కులాల వారికి 5 ఎకరాల భూమి, రూ.8 లక్షల ఆదాయంతో రిజర్వేషన్ కల్పించి, వెనుకబడిన కులాలకు బిజెపి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైసిపి బీసీ విభాగం నాయకులు బల్లేపల్లి కొండలు అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి అద్దంకి నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ధూపాటి ఏసోబు, సిపిఐ నాయకులు నక్కా ఆంజనేయులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం సమీపంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఆదివారం టంగుటూరు పోలీసులకు సూరారెడ్డిపాలెం సమీపంలోని పొలాలలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. ఎస్ఐ ఖాదర్‌బాషా, సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4,580 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పేకాటరాయుళ్లను సోమవారం కోర్టుకు హాజరు పరిచనున్నట్లు ఎస్ఐ ఖాదర్ బాషా పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-దొనకొండ

పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామానికి చెందిన దార్ల రాజు(39) బంధువు ఉప్పిని పునీత్‌తో కలిసి చేపలు పట్టేందుకు శుక్రవారం దూపాడు వెళ్లారు. గాలాలతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ కాలవలో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. పునీత్ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించటంతో అందరూ కాలవ వద్దకు చేరుకుని విస్తృతంగా గాలించారు. మండలంలోని దేశిరెడ్డిపల్లి వద్ద కాలవ ఒడ్డున ఆదివారం కనపడింది. మృతుని సోదరుడు దార్ల ప్రకాశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపురాంతకం ఎస్ఐ జీవీ సైదులు తెలిపారు.

వైద్య వృత్తితో పాటు సామాజిక సేవ: డాక్టర్ కొండలరావు

ఘనంగా ఐకాన్ 8వ వార్షికోత్సవం ● ఆశ్రమాలలో నిర్వహించిన మెడికల్ క్యాంపులు ● రూ.4 వేల వైద్య పరీక్షలు, మందులు ఉచితం

ప్రజాశక్తి-చీరాల

అత్యాధునిక వైద్యాన్ని చీరాల ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి వైద్య సేవలను అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహిస్తూ పేద వైద్యానికి చేయూతనందించడమే ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లక్ష్యమని హాస్పిటల్ ఎండి డాక్టర్ శంకరశెట్టి కొండలరావు అన్నారు. ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హాస్పటల్ ప్రాంగణంలో ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ పి శ్రీకాంత్ అధ్యక్షతన మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ పోలవరపు వెంకటప్రసాద్, డాక్టర్ ఎం నాగేశ్వరరావు పలువురు వైద్యులు హాజరై మాట్లాడారు. ఆధునిక వైద్యానికి గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండా చీరాల ప్రాంతంలోనే అత్యాధునిక వైద్యాన్ని ఐకాన్ హాస్పిటల్ ద్వారా చీరాల పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి డాక్టర్ కొండలరావు తీసుకురావటం అభినందనీయమని అన్నారు. చీరాల ప్రాంతంలో ఉన్న పలు ఆశ్రమాలలోని వృద్ధులకు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు మెడికల్ క్యాంపులను నిర్వహించారన్నారు. చీరాల ప్రాంతంలో హాస్పటల్‌ను నిర్మించి అటు వైద్య సేవలలోనూ, ఇటు సామాజిక సేవలలోనూ ఐకాన్ హాస్పిటల్ పేరుగాంచిందని అన్నారు. హాస్పటల్ ప్రారంభించినప్పటి నుంచి ఎన్నో విజయవంతమైన ఆపరేషన్లను చేసి ప్రజలకు మరింతగా చేరువ అవటంతో పాటు ఆరోగ్యశ్రీని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ముందుగా కొండలరావు తండ్రి శంకరశెట్టి రంగరామానుజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ.4 వేల విలువగల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కావ్య, జనరల్ సర్జన్ డాక్టర్ ఎస్ వెంకటరమణ, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సందీప్, హాస్పటల్ మేనేజర్ నాగరాజు, గణేష్, రంగారావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న డాక్టర్ కొండలరావు

కారంచేడులో నేత్రదానం

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు మండలం తిమిడిదపాడు గ్రామంలో దండా ఆంజనేయులు భార్య సుబ్బాయమ్మ(92) ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా చిన్న కాకానిలోని శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులకు తెలియ జేయగా శంకర్ కంటి ఆసుపత్రికి సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం నాడు కారంచేడు మండలం తిమిడిదపాడు గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యుల ఆమోదం మేరకు మృతురాలు సుబ్బాయమ్మ నేత్రాలను సేకరించారు. వైద్య సిబ్బంది కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. వైద్యులు మాట్లాడుతూ చనిపోయిన తర్వాత నేత్రాలు దానం చేయడం వలన ఇంకొకరికి చూపు వస్తుందని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని కోరారు.



వాణిజ్య పంటలను పరిశీలిస్తున్న అమెరికా బృందం

వాణిజ్య పంటల పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు గ్రామంలో నాగ శ్రీనివాసరావుకు చెందిన వంగ పంటను ఆదివారం అమెరికాకు చెందిన ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. వారిలో అసో సోఫియా, జిమైన, షెర్వుడ్, ఈక్వడార్‌లు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతిలో లభించే పోషకాలు వినియోగించుకొని ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని సూచించారు. తొలుత చింతమోటు గ్రామంలో వేములపల్లి రాజీవ్ కు చెందిన అరటి, పసుపు పంటలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజరు వాణిశ్రీ, వెల్లటూరు యూనిట్ ఇన్‌ఛార్జి ఎన్ ప్రసాద్, ఐసిఆర్‌పిలు ప్రమీల, సుశీల, సునీత, ప్రసన్న తదితరులు ఉన్నారు.



వైద్య శిబిరంలో రోగికి చికిత్స చేస్తున్న డాక్టరు

340 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కర్లపాలెం

వాతావరణం మార్పు కారణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని చీరాల గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో బాలకృష్ణ మూర్తి కాంప్లెక్స్‌లో పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఉచితంగా 340 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, కీళ్లు, ఎముకల వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించామన్నారు. రోగులకు ఉచితంగా ముందులను అందజేసి పలు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాగిత బుల్లియ్య, బోలాగాని వెంకటేశ్వర్లు, కోడూరి ప్రసాద్, ముక్కంటి, శివరావు, జి మీరయ్య, మల్లెల పౌలు, దాసరి బాబూరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న కృష్ణ అభిమానులు

సూపర్‌స్టార్ కృష్ణకు నివాళి

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

పిట్టలవానిపాలెంలో సూపర్ స్టార్ కృష్ణ దశ దిన కార్యక్రమాలు అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఐలాండ్ సెంటర్‌లో సినీ హీరో కృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అభిమానులు మాట్లాడుతూ నటశేఖర కృష్ణ తెనాలి ప్రాంతంలోని బుర్రిపాలేనికి చెందినవాడని, ఎందరికో సినీ జీవితాన్ని ప్రసాదించిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. తెలుగు సినీ చరిత్రలో ఎన్నో సాంకేతిక ప్రక్రియలను ప్రవేశపెట్టి తెలుగు సినీ పరిశ్రమను ఆకాశానికి ఎత్తిన గొప్పమనిషి కృష్ణ అని కొనియాడారు. తదుపరి వందలాదిమందికి అన్నదాన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో చటర్జీ, చిన్నబుజ్జి, నల్లూరి శ్రీనివాసరావు, శీలం రెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, ఈశ్వర్, సాంబయ్య, బ్రహ్మం, హీరో కృష్ణ అభిమానులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, భూముల సాధనకై ఉద్యమిద్దాం

వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-చిన్నగంజాం

పేదలందరికీ ఇళ్ల స్థలాలు, సాగుభుముల సాధన కోసం ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పిలుపిచ్చారు. ఆదివారం నాడు చినగంజాంలో వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ బి అగస్టీన్, తంగిరాల వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, నవరత్నాలు తెస్తామని ప్రకటించిందని తెలిపారు. అందులో భాగంగా 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని, జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించిందని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఒకటిన్నర సెంటు స్థలం, రూ.1,50,000 నిధులు కేటాయించి పక్కా ఇల్లు నిర్మిస్తామని చెప్పటం హాస్యాస్పదమని ఆయన అన్నారు. సెంటున్నర స్థలంలో నిర్మించిన ఇంటిలో ఒక కుటుంబం ఎలా నివసిస్తుందో ఆలోచించాలని ఆయన అన్నారు. ఉన్న ఇల్లు కూల్చివేసుకుని, కొత్త ఇల్లు నిర్మాణం జరగక ఎండకు ఎండి వానకు తడిసే పరిస్థితి దాపురించిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి కనీసం 5 లక్షల



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

రూపాయల నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల ప్రకారం 38 లక్షల భూమి పేదలకు పంచేందుకు ఉందని అన్నారు. రాష్ట్రంలో పేదలకు సాగు భూములు పంచాలని, నవరత్నాలకు మరొక రత్నం భూ పంపిణీ చేర్చి దశరత్నాలు అమలు చేయాలని కోరారు. పేదల దగ్గర ఉన్న భూమిని బలవంతంగా గుంజుకునే ప్రయత్నం చేస్తే పేదలను సమీకరించి ఎదుర్కొంటామని ఆయన అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులను, లౌకిక రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతోందని ఆయన విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాన్ని అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 80 ఏళ్ల క్రితం స్థాపించారన్నారు. నేడు దేశంలో 80 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద వ్యవసాయ కార్మిక సంఘంగా ఉందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం చేసిన పోరాటాల ఫలితంగా భూసంస్కరణల చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ, కౌలుదారీ చట్టాలు, ఉపాధి హామీ చట్టం అనేక సంక్షేమ పథకాలు, హక్కులు సాధించుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం, గుంటూరు జిల్లా కార్యదర్శులు కంకణాలు ఆంజనేయులు, ఈమని అప్పారావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందించాలని, ఉపాధి హామీ పనిలో జరుగుతున్న అవినీతి అక్రమాలు అరికట్టాలని ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 8,9,10 తేదీల్లో జంగారెడ్డి గూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మహాసభ ప్రారంభానికి ముందుగా ఎస్ రామచంద్రరాజు వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. టీ కృష్ణమోహన్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో జిల్లా కన్వీనర్ మోండ్రు ఆంజనేయులు, జిల్లా నాయకులు బి సుబ్బారావు, డి జయమ్మ, సుబ్బరాజు, సిహెచ్ శ్రీను, సిఐటియు నాయకులు జి ప్రతాప్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్య తదితరులు మాట్లాడారు.

కలిసిమెలిసి ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ అధికారులు కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్లపాలెం మండలం గణపవరం గ్రామంలో జిల్లా అధికారుల ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని, సమిష్టి కృషితో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల అధికారులకు మానసిక ప్రశాంతత ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు.




లెమన్ స్పూన్ ఆడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు



జిల్లా అధికారుల వన సమారాధనలో మాట్లాడుతున్న అధికారి

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటపాటలతో అధికారులు ప్రేక్షకులను అలరించారు. గేమ్స్‌లో గెలుపొందిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డిఐజి త్రివిక్రమ్, బాపట్ల జిల్లా ఎస్పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ప్రకాశం జిల్లా ఎస్పి మలికగర్గ్, బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, రవాణా శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, మత్స్యశాఖ జెడి సురేష్, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారులు రవీంద్ర, సరోజిని, పార్థసారథి, తహశీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



పైప్ లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం

పైపులైన్ ప్రారంభం

ప్రజాశక్తి-చీరాల: చీరాల మండలంలోని బుర్లవారిపాలెం, గవినివారిపాలెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌లను ఆదివారం శాసనసభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ పనులను పూర్తిచేసి త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పైపులైన్ ద్వారా ప్రవహించే నీరు ఆయా ప్రాంత రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనంతరం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గవిని ప్రసాద్, ఆర్‌బికె చైర్మన్లు కావూరి రమణారెడ్డి, ఆర్‌బీకే పలపోలు శ్రీను, బుర్ల సాంబశివరావు, చావలి వాసుదేవ్, గవిని నాగరాజు, డేగల నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన

సిఐటియు వేటపాలెం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్

ప్రజాశక్తి-వేటపాలెం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని, సంఘటిత పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను సాధించగలమని బాపట్ల జిల్లా సిఐటియు కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వేటపాలెం మండల సిఐటియు మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సీనియర్ పంచాయతీ వర్కర్ రావుల దావీదు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సిహెచ్ మజుందార్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చట్టాలను తయారు చేసేందుకు పూనుకుంటున్నాయని విమర్శించారు. కార్మికుల ఐక్యత ద్వారానే ఈ నిరంకుశ తత్వాన్ని అడ్డుకోగలమని ఆయన



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నలతోటి బాబురావు మాట్లాడుతూ కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ సిఐటియు ఉంటుందని నొక్కి చెప్పారు. హక్కులతో పాటు బాధ్యతలు సమన్వయం చేసుకొని ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారి గురించి వివరించారు. వారి మాదిరిగానే మనం ఐక్యంగా ఉండాలని చెప్పారు. మహాసభ చివరిలో వేటపాలెం మండల సిఐటియు నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. మండల సిఐటియు మండల నూతన అధ్యక్షులుగా ఇండ్ల బ్రహ్మయ్య, కార్యదర్శిగా మచ్చ అయ్యప్పరెడ్డి, కోశాధికారిగా ఏ సురేష్‌తో పాటు మొత్తం 13 మంది నూతన కార్యవర్గం ఏర్పడింది. ఈ మండల మహాసభకు పంచాయతీ వర్కర్స్, జీడిబట్టి కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, రిక్షా, ఆటో, ముఠా రంగాల నుంచి ఎంపిక చేసిన ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతినిధులందరూ నూతన కార్యవర్గం తీసుకున్న అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా సెక్రెటరీ ఏ వెంకటేశ్వరమ్మ, సంధ్య, శివమ్మ, సుబ్బమ్మ, దానయ్య, అంకాలు, సంజీవ్, కొండయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
సోమవారం 28 నవంబర్ 2022



సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పామూరు

డిసెంబర్ 4న కనిగిరిలో నిర్వహించనున్న ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి పి. కల్పన పేర్కొన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం షేక్ రజియా అధ్యక్షతన ఆదివారం విస్తృత స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, పని భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు కొరకు ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలిపారు. కార్మిక చట్టాలు అమలు కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని, ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాల రూపొందిస్తామన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఆడిటర్ వందనం పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి అరుణ, ఆశ నాయకురాలు అంకమ్మ, తిరుపతమ్మ, సావిత్రి, జీవి, రవణమ్మ, అనసూర్య, సిఐటియు నాయకులు కె. మాల్యాద్రి, షేక్ అల్లాబక్షు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికసంఘం

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చీమకుర్తి



వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

డిసెంబర్ 8,9,10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెలో నిర్వహిస్తున్న 29వ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని దేవం పాలెం గ్రామంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజా చెన్నయ్య,వంజా పోతురాజు, ఇస్తాల సింగయ్య, దాసరి కోటేశ్వరరావు,ఇస్తాల మాల్యాద్రి,వంజా రామ స్వామి, ఇస్తాల కీసు పాల్గొన్నారు.

కొండపి: డిసెంబర్ 8,9,10 తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేజీ మస్తాన్ కోరారు. కొండపి మండలంలోని పెరిదేపి గ్రామంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేజీ మస్తాన్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ప్రారంభం సందర్భంగా డిసెంబర్ 8వ తేదిన భారీ ప్రధర్శన బహిరంగ సభ జరుతాయని ఆయన తెలిపారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా మాజి ఎంపి బృందాకరత్, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు విజయరాఘవన్, బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సభలో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు అంగలకుర్తి పరిమళ,నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, గడ్డం పిచ్చయ్య, లక్కీపోగు సుదాకర్, లక్కీపోగు దావీదు, మల్లెల సంపూర్ణ, దర్శిగుంట స్వరూప, లెక్కిపోగు కెజియా, దారా జనార్ధన్, మల్లెల నిర్మల, మల్లెల సింగమ్మ, మల్లెల రెడ్డి, అంగలకుర్తి కోటేష్, అంగలకుర్తి ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తులశమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

తులశమ్మకు నివాళి

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన జల్లాపరిషత్ మాజీ వైస్ చైర్మన్ మారెళ్ళ వెంకటశేషయ్య తల్లి తులశమ్మ దశదినకర్మ ఆదివారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు పాల్గొని తులశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇనగంటి రమణారెడ్డి, యర్రా దశరథ, మారెడ్డి వీరారెడ్డి, కందుల డానియల్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్‌సిసి ఆఫీసర్

నిడమానూరులో ఎన్‌సిసి వేడుకలు

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

కూనం శ్రీరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హెచ్. నిడమానూరులో 74వ ఎన్‌సిసి దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సిసి ఆఫీసర్ నన్నెబోయిన వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్లు డ్రిల్ నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల పూర్వపు విద్యార్థి గోవాడ శ్రీనివాసరావు సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు కాట్రగడ్డ వెంకట్రావు, యరమాల రవివర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దొడ్డవరంలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి మద్దిపాడు

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అనే పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని దొడ్డవరం గ్రామములో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి, జడ్‌పిటిసి తేళ్ళ భాగ్యలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ అప్పారావు, స్థానిక నాయకులు ప్రసీద, బత్తుల శ్రీను, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆడిటోరియాన్ని వెంటనే నిర్మించాలి

ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ డిమాండ్

పిఎన్ఎం అధ్యక్ష, కార్యదర్శులుగా పేతురు, సురేష్ ఎన్నిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



పేతురు



సురేష్

కళాకారులకు నిలయమైన ఒంగోలులో ఆడిటోరియాన్ని నిర్మించాలని ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ప్రజానాట్య మండలి ప్రకాశం జిల్లా 10వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గందవల్ల బాలకష్ణ మాట్లాడుతూ ఒంగోలులో ఆడిటోరియం నిర్మాణం ఎన్నికల హామీగా మిగిలిపోతుం దన్నారు. చిత్తశుద్ధి లేని పాలకుల అబద్దాలు, ప్రకటనలు ప్రజలు, ,కళాకారులు, రచయి తలు, కవులను నిరంతరం మోసం చేస్తున్నా రన్నారు. అనంతరం 17మంది తో కొత్త కమి టీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. పేతురు, ఉపాధ్యక్షులుగా బి. రాజా రమేష్, కె.మహేష్ ,రూబెన్. ప్రధాన కార్యదర్శిగా పొత్తూరి సురేష్, సహాయ కార్యదర్శులుగా సూరిబాబు, ఇంద్రజ్యోతి ఎన్నికయ్యారు. ఉబ్బా కోటేశ్వ రరావు, విజయ్, చిన్ని, బందెల సుధాకర్, ఎం. బాబూరావు , ఎస్‌కె. ఖాశిం వలీ, ఎం.సుజాత, మెహన్ రావు, ఇద్దరు కో ఆప్షన్ నెంబర్స్ కమిటీ సభ్యులుగా కొత్త కమి టీని ఎన్నున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రాతిపదిక

రిజర్వేషన్లను వ్యతిరేకిద్దాం : కెవిపిఎస్

ప్రజాశక్తి-చీమకుర్తి



మాట్లాడుతున్న దుడ్డువెంకటరావు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల పేరుతో అగ్రకుల పేదలకు విద్య, ఉద్యోగ రంగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పిం చడం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బ తీసే విధంగా ఉందని కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు పేర్కొ న్నారు. ఆదివారం స్థాణిక ఏకలవ్య భవనంలో రాంబాబు అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాకళామండలి ప్రధాన కార్యదర్శి కోటి,కెవిపిఎస్ మండల కార్యదర్శి టి రామారావు, వివిధ సంఘాల నాయకులు బండ్లడేవిడ్, దోమల పుల్లయ్య, మర్రి లక్ష్మినారాయణ, పి.శ్రీనివాసరావు,వై శ్రీనివాసరావు,జి ప్రతాప్, దుర్గారావు, కొత్రపు రాఘవరావు, సంగా భాను, రామ్మూర్తి పాల్గొన్నారు.

లేబర్‌కోడ్స్ ఉపసంహరించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- జరుగుమల్లి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

దేశం, రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు తెలిపారు. సిఐటియు మండల మహాసభ బెజవాడ శివయ్య అధ్యక్షత ఆది వారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 27 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చినట్లు తెలిపారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు భవననిర్మాణ కార్మికులకు ఇసుక సక్రమ పద్ధతిలో సప్లై చేసి భవననిర్మాణ కార్మికులను ఆదుకోవాలని చెప్పి కోరారు అనంతరం 17 మందితో నూతన మండల కమిటీని ఎనుకున్నారు. మండల అధ్యక్షుడిగా బెజవాడ శివయ్య, కార్యదర్శి ఎం.వెంకటరావు, కోశాది కారిగా ఎన్. రమాదేవి ఎన్నికయ్యారు. మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక జిల్లా నాయకులు తన్నీరు సుబ్బారావు,రైతు సంఘం మండల నాయకుడు శేషయ్య, సిఐటి యు జిల్లా కార్యదర్శి టి. రాము కెవిపి ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజస్ పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయండి

ఆచార్య కొలకలూరి ఇనాక్ పిలుపు

కళామిత్ర మండలి పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్



కళామిత్ర మండలి

తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆచార్య కొలకలూరి ఇనాక్ పిలుపు నిచ్చారు.ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ కళామిత్ర మండలి ఇస్తున్న జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలను వివిధ రాష్ట్రాల నుంచి, జిల్లాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు, కవులు ప్రదానం చేయటం గొప్ప విషయమన్నారు. అనంతరం నూనె వెంకాయమ్మ–వెంకటరత్నం స్మారక జీవిత సాఫల్య పురస్కారాన్ని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కి ప్రదానం చేశారు. ఉత్తమ జర్నలిస్టు అవార్డును సూర్య దినపత్రిక బ్రాంచిమేనేజర్ గొట్టిపాటి నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళామిత్ర మండలి అవార్డ్స్ కమిటీ చైర్మన్ తేళ్ల అరుణ, సాహితీపోషకులు వీరవల్లి సుబ్బారావు, కష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జివి. పూర్ణచందు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ సంగీత విద్వాంసులు, సాహిత్యవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నారాయణ విద్యా సొసైటీ చైర్మన్ కొల్లా నారాయణరావు, అళహరి చెంచలరావు , జి.గురవారెడ్డి ,కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జున రావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావులు, కె.వి రమణారెడ్డి, నూకతోటి శరత్ బాబు, సంస్థ కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

వైద్యం అందుబాటులో లేదు

ప్రజాశక్తి మద్దిపాడు

సిఐటియు మండల మహాసభ ఎండి. బేగ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని వివరించారు. విద్య వైద్యం సామాన్యులకు అందుబాటులో లేదన్నారు. అనంతరం సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ కాశీం, ఉబ్బా ఆదిలక్ష్మి ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో మధు, కాశీం, ఠాగూర్, జయరావ్, ధనలక్ష్మి,నిర్మల పాల్గొన్నారు.

పుస్తకాల్లేని చదువులు..!

- ఆందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యార్థుల అభ్యసనానికి పాఠ్యపుస్తకం ఎంతో కీలకం. సందేహాల నివత్తి, పరీక్షలకు సన్నద్ధం కావాలంటే పుస్తకం తప్పనిసరి. ఈ విషయం అందరికీ తెలిసినా ప్రభుత్వం, విద్యాశాఖ మేల్కోవడం లేదు. సగం విద్యా సంవత్సరం గడిచినా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. పుస్తకాలు లేకుండానే పాఠాలు చెప్పేస్తున్నారు. పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండో యూనిట్, క్వార్టర్లీ పరీక్షలను పూర్తి చేశారు. అర్ధ సంవత్సరం పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జనవరి ముగిస్తే వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాల్సి ఉంది.

ఇంత నిర్లక్ష్యమా..?

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 32 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 37 ఇంటర్ అమలయ్యే కస్తూరిబా పాఠశాలలు,



11 ఆదర్శ విద్యాలయాలు ఉన్నాయి. వీటి మొత్తంలో ఈ ఏడాది సుమారుగా 49,800 మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు ఇస్తామని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని విద్యాశాఖ ప్రకటించింది. తరగతులు ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ ఒక్క పుస్తకం కూడా ఇవ్వలేదు. ఏం చదవాలి, పరీక్షలెలా రాయాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేసున్నారు. బయట కొందామంటే పుస్తకాలు లభ్యం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

పరీక్షలపై స్పష్టత లేదాయె..

కళాశాలల గుర్తింపు, వాటి అనుమతుల పునరుద్ధరణలో జాప్యం కారణంగా ఈ ఏడాది పరీక్షల షెడ్యూల్ విడుదలలో ఆలస్యమైంది. వచ్చే ఏడాది మార్చి 4 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని సూచన ప్రాయంగా వెల్లడించారే తప్ప, ఇంత వరకు అధికారికంగా ఆదేశాలు రాలేదు. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో యూనిట్, క్వార్టర్లీ పరీక్షలు జరిగాయి. ఈనెలలో అర్ధ సంవత్సర పరీక్షలు జరగాల్సి ఉండగా వాయిదా వేశారు.

పాతవి సర్దుబాటు చేశాం..

గతంలో మిగిలిన పాఠ్య పుస్తకాలను పలువురికి సర్దుబాటు చేశాం. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాం. సిలబస్ పూర్తి కాకపోవడంతో నవంబరు 12 నుంచి జరగాల్సిన అర్ధ సంవత్సరం పరీక్షలు డిసెంబరు 12కి మార్చారు. వార్షిక పరీక్షల షెడ్యూల్, ఫీజులపై ఆదేశాలు రావాల్సి ఉందని ఇంటర్ బోర్డు జిల్లా అధికారి తెలిపారు.



చిల్లపాదలనుతొలగిస్తున్న దృశ్యం

చిల్లచెట్ల తొలగింపు

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని తాడివారిపల్లి గ్రామంలో బ్రిటిష్ కాలంలో 1929లో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. పోలీసు స్టేషన్ ఆవరణమంతా చిల్ల చెట్లు పెరిగి చిట్టడవిని తలిపిస్తోంది. గ్రామ సర్పంచి జనమాల జాన్‌రత్నం, తాడివారిపల్లి ఎస్ఐ పి.ముక్కంటి, మార్కాపురానికి చెందిన ఇండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో స్టేషన్ ఆవరణలో ఉన్న చిల్లచెట్లను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల ఫౌండేషన్ సభ్యులు మధిరె శివారెడ్డి, కలువ భాస్కర్‌శ్రేష్టి, ఇండ్ల మేఘనాథ్‌రెడ్డి, ఆకుల శ్రీను, ఇండ్ల తిరుపతిరెడ్డి, తప్పేట తిరుపతిరెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'గడప గడపకూ'

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 28 నుంచి 30 వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ ఎస్.నరసింహులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిల్లు, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొనాలని ఎంపిడిఓ తెలిపారు.



కృష్ణ సంస్మరణసభలో మాట్లాడుతున్న నాయకులు

చిరస్మరనీయుడు సినీ నటుడు కష్ణ

ప్రజాశక్తి - మద్దిపాడు

తెలుగు సినిమా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నటుడు సూపర్ స్టార్ కష్ణ అని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరబాద్రాచారి తెలిపారు. స్థానిక శ్రీ నటరాజ కళాకేంద్రంలో దివంగత సినీనటుడు కష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి నాగేశ్వరరావు మాట్లాడు తూ నాటి సినీ చరిత్రలో అగ్ర నాయకులకు దీటుగా సినిమాలకు దర్శకత్వం వహించి తట్టుకున్న ఘనుడు సూపర్‌స్టార్ కష్ణ తెలిపారు. బజాజ్ షో రూం అధినేత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సినీమా చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొంది ప్రజల గుండెల్లో చిరకాలంగా కష్ణ నిలిచి పోతాడాని కొనియాడారు. ఈ కార్యక్రమం లో నట్టే సుబ్బారావు, మాజీ సర్పంచి జజ్జర శరత్ బాబు, జి. నరసింహారావు, కాకుమాను సుబ్బారావు, ఎన్. సత్యనారాయణ, రామకష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగరపంచాయతీ పరిధిలోని లంకోజనపల్లి ఎస్‌సి బాలికల వసతి గృహంలోని 125 మంది విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నారపశెట్టి మధు, సత్యనారాయణ, రెడ్డిమాసు శ్రీను, రాఘవులు, విద్యాసాగర్ రెడ్డి, ఆంజనేయులు, ఆదినారాయణ, ఖాశిం, రవి, హాస్టల్ వార్డెన్ రజిని, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు రూ.26 వేలు జీతం అమలు చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్ డిమాండ్ చేశారు. సిఐటియు రాచర్ల మండల 3వ మహాసభ ఆదివారం నిర్వహించారు. తొలుత సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్ అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల్ని నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని తెలిపారు. స్కీం వర్కర్లకు పిఎఫ్, ఇఎస్‌ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ అమలు చేయాలన్నారు. కార్మిక సంఘాలు నిర్మాణం కోసం అన్ని మండలాల్లో సిఐటియు మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిఐటియు గిద్దలూరు డివిజన్ సిఐటియు కార్యదర్శి టి. ఆవులయ్య మాట్లాడుతూ స్కీమ్‌వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహాసభలో సిఐటియు గిద్దలూరు పట్టణ కార్యదర్శి బి.నర్సింహాలు, రాచర్ల మండల కార్యదర్శి డి.థామస్ ,



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రమేష్

ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణ రంగ, పారిశుధ్య కార్మికులు, కార్మిక సంఘాలు స్కీంవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు మండల 3వ మహాసభ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎ.సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా యామా కుమారి, పి.లక్ష్మీదేవి, సుంకర అల్లూరయ్య, ప్రధానకార్యదర్శిగా డి.థామస్, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, డి.విజయలక్ష్మి, పాపయ్య, ట్రెజరర్‌గా రంగస్వామి, కమిటీ సభ్యులుగా పోలయ్య, భారతి, సుకుమారి, సంతోషి, రత్నకుమారి, గురవయ్య, బాలమ్మ, రసూల్, క్రాంతి ఎన్నికయ్యారు.

వైసిపి అరాచక పాలనకు చరమ గీతం పాడాలి

ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి - గిద్దలూరు

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ముత్తుముల అశోక్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి టిడిపి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో బస్మాసుర పాలనను సాగిస్తూ రాష్ట్ర ప్రజలను ముప్ప తిప్పలు పెడుతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిధిలోని అన్ని మండలాల టిడిపాఇ అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ, పార్లమెంటు కమిట టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

అశోక్ రెడ్డి విజయానికి ముస్లిములు కషి చేయాలి

రాబోయే ఎన్నికలలో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని టిడిపి మైనార్టీ నాయకుడు హుస్సేన్ ఖాన్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మైనార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ ఖాన్ నేడు గిద్దలూరు పట్టణ ప్రజలకు తాగు నీరు అందుతుంటే అది అశోక్ రెడ్డికృషేని తెలిపారు.



జంకెను సన్మానిస్తున్న దృశ్యం

లక్ష్యసాధనకు కఠోర శ్రమ అవసరం

వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

లక్ష్యసాధనకు కఠోరశ్రమ అవసరమని వైసిపి ప్రకాశంజిల్లా అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక శ్రీగౌతమి జూనియర్ కళాశాలలో విద్యాసంస్థలచైర్మన్ కనుమర్ల గుండారెడ్డి అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈవేడుకలను జంకె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించడానికి అనుక్షణం శ్రమించాలని సూచించారు. అందుకు గాను అవసరమైన వనరులను ఉపయోగించుకొని ముందుకు సాగాలని తెలిపారు. కళాశాల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతికను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ముందుగా మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు, యర్రగొండపాలెం మండల తహాశీల్దార్లు కష్ణారెడ్డి రవీంద్రారెడ్డి, మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకుడు కొండయ్య, గౌతమి కళాశాలల పరిశీలకుడు కనుమర్ల శ్రీరామ్ రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ వి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, బాలకష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెన్నాకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ప్రజాశక్తి-పొదిలి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వెన్న హనుమారెడ్డి పుట్టినరోజు సందర్భంగా మార్కాపురంలోని ఆయన నివాసంలో పొదిలి మండల నాయకులు ఆదివారం ఆయన్ని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహరావు, కంభాలపాడునాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరాయిపాలెంలో నీటి కష్టాలు

నీటి కోసం పొలాల బాట పడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయితీ పరిధిలోని వీరాయిపాలెం గ్రామంలో మంచినీటి కష్టాలు అధికమయ్యాయి. ఆ గ్రామంలో ఉన్న ఏడు డీప్ బోర్లు ఎండిపోయాయి. చుక్కనీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పొలాలకు పట్టే నీరే ఆధారంగా మారింది. గ్రామంలోని ఒకరైతు తన పొలానికి పంపే నీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజల సరఫరా చేయడం జరుగుతుంది. అయినా కానీ ఆనీరు చలాక ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పశుపోషకులు మూగజీవాలకు నీరందించలేకపోతున్నామని వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శ్రీకాంత్ దృష్టికి సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పైగా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయకపోగా మీరే ఎలాగోలా తోలించుకోండి అంటూ సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక దూర ప్రాంతాల్లోని పొలాల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని వీరాయిపాలెం గ్రామానికి చెందిన మస్తానమ్మ, సుబ్బులు, కోటేశ్వరి, కుమారి, వెంకటేశ్వర్లు, తదితరులు కోరుతున్నారు.



మంచినీటి కోసం ఎదురుచూస్తున్న దృశ్యం

జలజీవన్‌కు నిధులు మంజూరు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో గల 123 గ్రామాలకు నూతనంగా జల జీవన్ మిషన్ పథకం కింద రూ. 43.40 కోట్లు నిధులు మంజూరు అయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ యర్రగొండపాలెం మండలంలో 29 గ్రామాలకు, త్రిపురాంతకం మండలంలో 26 గ్రామాలకు, దోర్నాల 11 గ్రామాలకు, పెద్దారవీడు మండలంలో 26 గ్రామాలకు, పుల్లలచెరువు మండలంలో 29 గ్రామాలకు ఇంటింటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 2023 మార్చి నాటికి పూర్తి చేసి నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.



డీఈ రామకృష్ణ

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

వైసిపి కొండపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి -శింగరాయకొండ

ప్రతి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటాడని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఆదివారం శింగరాయకొండ గ్రామ పంచాయతీ లోని సచివాలయం 2 పరిధిలోని బైరాగి మన్యం, కందుకూరు రోడ్డు, పోస్టాఫీసు సెంటర్, ఇస్లాం పేట, హనుమాన్ నగర్ ప్రాంతాలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. గడపగడపకూలో భాగంగా ఇద్దరు ముస్లీం మహిళలు తమకు జగనన్నకాలనీలో ఇంటి స్థలం మంజూరయ్యిందని, కానీ ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేదని వరికూటి దృష్టికి తీసుకురాగా వారికి ఇళ్లు నిర్మించే పూచీ తనదని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంటు వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ రాపూరి ప్రభావతి , వైస్ ఎంపిపి సామంతుల రవి కుమార్ రెడ్డి , కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌డి సర్దార్, దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, వార్డు సభ్యులు తన్నీరు నాగేశ్వరరావు ఎస్ కేకరీం, పాదర్తి కోటేశ్వరరావు, వైసిపి సీనియర్ నాయకులు ఎస్‌కె సలీం భాష , వైసిపి పట్టణ అధ్యక్షులు ఎస్‌కె పటేల్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, సవలం కోటేశ్వరరావు, కష్ణారెడ్డి, ఎరమాల సుబ్బారావు, దామతోటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి రాయి పేర్రాజు, శ్రీహరి రెడ్డిల పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

అవయవదాన దాతకు సత్కారం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులను సత్కారం లభించింది. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో దోర్నాల పట్టణానికి చెందిన వైసిపి నాయకులు కాసా రఘునాథరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులు స్పందించి జీవనధార సభ్యుల ద్వారా అవయవాలను దానం చేశారు. నేడు జాతీయ అవయవాల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని వారి కుటుంబ సభ్యులైన మహేష్‌రెడ్డికి తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని ఆదివారం అందుకున్నారు. అవయవ దాన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పశంసా పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం



భైరవకోనను దర్శించుకున్న కదిరి పార్థసారథి

భైరవకోనలో 'కదిరి' పూజలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

కదిరి బాబూరావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రమైన భైరవకోనను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వర స్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు, అర్చకులు ఆయనను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కదిరి రమణయ్య, ఉపసర్పంచి టి.బాబూరావు, కదిరి బాబురావు కళాశాలల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. వీరన్నగౌడ్, కె.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి మునగల వెంకటనారాణరెడ్డి, కొట్టే శ్రీను, పి.తిరుపతయ్య, షేక్ అహమ్మద్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పెద్దబాల శిక్షపై పరీక్ష

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్‌పురం మరియు పామూరు మండలాల్లో 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదవుతున్న విద్యార్థులకు ఓం శ్రీ పరాశక్తి తల్లి ఫ్రెండ్స్ ట్యూషన్ పాయింట్ మరియు ఫ్రెండ్స్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పెద్దబాలశిక్షపై ఆదివారం పరీక్ష నిర్వహించారు. విజేతలకు సినీ డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ వద్ద సిఒగా పని చేసిన వర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ట్యూషన్ పాయింట్ డైరెక్టర్ ముత్యాల నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని నాగేండ్ల ముడుపు సచివాలయ పరిధిలోని పత్తేపురంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు కార్యక్రమానికి సర్పంచి తిరుమల పెద్దబాలసుబ్బమ్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తేపురం గ్రామంలో రూ.10.21 లక్షల అంచనా వ్యయంతో జలజీవన మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పథకంలో భాగంగా వాటర్‌లైన్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కందుల సుజాత, గ్రామ వైస్ సర్పంచి చీదర్ల వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు కలువ బాలగురువారెడ్డి, కందుల ఎలీషా, కలువా రామాంజనేయరెడ్డి, తిరుమల అంజయ్య, వైసిపి బూత్ కన్వీనర్ మూడమంచు పోలయ్య, యువజన నాయకుడు మేకల వెంకట్‌రెడ్డి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



జనరల్ సెక్రటరీగి నియామక పత్రం అందుకుంటున్న నాళం

సర్వేయర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నాళం వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఎపి సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా జిల్లాలోని సంతనూతలపాడులో సర్వేయర్‌గా పనిచేస్తున్న నాళం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఎన్నికలు కాకినాడలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సర్వే ఉద్యోగులందరూ ఎకగ్రీవంగా నాళం వెంకటేశ్వర్లు పేరును అంగీకరించడంతో పోటీ లేకుండానే ఆయన పదవి దక్కించుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అనకాపల్లి జిల్లాకు చెందిన ఆర్.చిరంజీవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాళం వెంకటేశ్వర్లును ప్రకాశం జిల్లా సర్వేఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కోటి, సెక్రెటరీ బాబూరావు, కోశాధికారి విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరిశుద్ధరావు తదితరులు అభినందించారు.



గుంతలు పడ్డ యర్రగొండపాలెం - త్రిపురాంతకం రోడ్డు

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో అధ్వాన్నంగా తయారై, ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహనదారులు అంటున్నారు. ముఖ్యరా రామ సముద్రం, అయ్యంబొట్లపల్లి గ్రామ సమీపంలో ఏర్పడ్డ గుంతల కారణంగా వాహనాలు అదుపుతప్పి గాయాలపాలైన సంఘటనలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఇకనైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

అనిల్‌పాదయాత్రకు కందుల సంఘీభావం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, టిఎన్ఎస్ఎఫ్ ఒంగోలు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి షేక్ గౌస్ బాషా వారి మిత్ర బృందం తిరుమల శ్రీవారి సన్నిధికి పాదయాత్ర చేపట్టారు. అందులో భాగంగా మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఆదివారం నెల్లూరు జిల్లా పొదలకూరులో యాత్ర బృందాన్ని కలిసి యోగ క్షేమముల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మీగడ ఓబుల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తర్లుపాడు మండల టిడిపి అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కుందూరు కాశిరెడ్డి, తెలుగు యువత పొదిలి అధ్యక్షులు పోపూరి నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రమేష్

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పొదిలి

స్వచ్ఛ భారత్ కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఈనెల 30న మండల పరిషత్ కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్న ధర్నాలను జయప్రదం చేయాలని సిఐటియు ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఎం. రమేష్ తెలిపారు. టి.ఇశ్రాయెల్ అధ్యక్షతన స్వచ్ఛ భారత్ కార్మికుల జిల్లా సమావేశం ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు 6 నెలల నుంచి 27 నెలలు జీతాలు బకాయిలు ఉంటే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామంటున్న వైసిపి పభుత్వం కార్మికులు చేత పని చేయించుకొని 27 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం సిగ్గు చేటన్నారు. కార్మికుల పోరాటం ఫలితంగా 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి జీతాలు చెల్లిస్తామని జిల్లా అధికారులు ప్రకటించినా, నేటికీ 10 శాతం కార్మికులకు కూడా జీతాలు అందలేదన్నారు. తక్షణం 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.. ఈ సమావేశంలో సంఘం నాయకులు డి.జాన్, ఎం.ఆనందరావు, జి.కోటేశ్వరావు, యం.నరసయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఇట్టా నాగయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. పారిశుధ్య పనులు చేసే కార్మికులపైన కొంతమంది రాజకీయ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చేపట్టిన సమ్మె కాలంలో ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాలు నేటికీ అమలు కాలేదన్నారు. కార్మికులపై పని భారం పెరిగిందని



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

వివరించారు. చనిపోయిన, ఆరోగ్యం బాగు లేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకొని ఆప్కాస్‌లో చేర్చుకుండా అనేక షరతులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇటీవల కాలంలో సుమారు 30మంది కార్మికులు చనిపోయారని తెలిపారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయమని కార్మికులపై పనిభారం మోపుతున్నారన్నారు. కొత్తగా మున్సిపాలిటీలలో చేరిన పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు నేటికీ హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. యూనియన్ ఒంగోలు నగర వర్కింగ్ సెక్రటరీ శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల హెల్త్ అలవెన్స్‌లు వెంటనే ఇవ్వాలన్నారు. చెత్త సేకరించేందుకు ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు సేఫ్టీ మెటీరియల్స్ హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. జగనన్న ఇళ్ల కింద కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నాయకులు పోకల కోటేశ్వరరావు, యు .రత్నకుమారి, కె. సామ్రాజ్యం, ఎస్‌కె.ఖాదర్ వలీ, పి.ఏడుకొండలు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అండర్-14 క్రికెట్ సెలెక్షన్స్

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏబిఎం డిగ్రీ కళాశాలలో అండర్-14 క్రికెట్ ఎంపికలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్(పిడిసిఎ) జిల్లా అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్ దాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో క్రీడలకు విరామం ప్రకటించినట్లు తెలిపారు. ప్రస్తుతం కరోనా తగ్గడంతో దేశవ్యాప్తంగా క్రీడలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా అండర్-14 క్రికెట్ క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించామన్నారు. అండర్-14 క్రికెట్‌కు మొదటి తొలి మెట్టు అని తెలిపారు. ఇది రాష్ట్ర ,జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రికెట్ ఆడడానికి దోహదపడుతుందన్నారు. ఈ ఎంపికలలో 116 మంది పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనపర్చిన 32 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే శని, ,ఆదివారాలలో కోరిశపాడు మండలం రావి నూతల క్రికెట్ గ్రౌండ్‌లో లీగ్ మ్యాచ్ లు నిర్వహించి 16 మంది క్రీడాకారులతో ప్రకాశం జిల్లా జట్టును ఎంపిక చేసామన్నారు. సంయుక్త కార్యదర్శి కొల్లా మధు మాట్లాడుతూ రాబోయే కాలంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పనకు కషి చేస్తామన్నారు. ఎంపిక ప్రక్రియకు న్యాయ నిర్ణేతలుగా పి.శ్రీను, భువన, వాసు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అనిల్, అసోసియేషన్ సభ్యులు హనుమంతరావు , నవీన్, బి.శ్రీను, బి.కమల్ , సాయికష్ణ, సీనియర్ కోచ్ సుధాకర్ , ఫిజియోథెరపీ డాక్టర్‌ఆంజనేయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిల కోసం పోరాడాలి

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జిలానీ బాషా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆర్‌టిసి కార్మికులకు రావలసిన బకాయిలు, హక్కుల కోసం పోరాడాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.జిలానీ పిలుపు నిచ్చారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా 9వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. తొలుత యూనియన్ పతాకాన్ని బివి. రావు ఆవిష్కరించారు. అధ్యక్షవర్గంగా బివి.రావు, అల్లాడి సుబ్బారావు వ్యవహరించారు. ఈ సందర్భంగాజిలానీ మాట్లాడుతూ ప్రభుత్వం పథకం ప్రకారం ఆర్‌టిసి నిర్వీర్యం చేయాలని చూస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రమణ్యం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి, నెల్లూరు నాన్ ఆపరేషన్ నాయకులు ఎవి. రామయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిశంకర్, హరి ప్రసాద్, డి.కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం 15 మంది ఆఫీస్ బేరర్స్‌తో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బివి.రావు, పిఎస్. రావు, ఉపాధ్యక్షులుగా డిఎం.రావు, ఎఎస్.రావు, కెవి. భాస్కర్ రెడ్డి, యు.కాశీరత్నం, యువిరావు, సహాయ కార్యదర్శులుగా ఎంఎ. రెడ్డి, జివి.సుజాత, ఎస్‌డి.పీరావలి, ఇ.శ్రీనివాసరావు, జి. శ్రీనివాసులు, టి.కిషోర్, ప్రచార కార్యదర్శిగా మీరావలి, కోశాధికారిగా పి.విజయ్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.



నూతన కమిటీ ఇదే

ఉత్సాహంగా నెల్లూరు జోన్ మహాసభ

స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఆర్‌టిసి స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ 3వ నెల్లూరు జోన్ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలకు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి కార్మికులు పాల్గొన్నారు. ఈ మహాసభలలో ప్రకాశం జిల్లా నుంచి ఎం.అయ్యప్ప రెడ్డి, జివి. సుజాత, గుంటూరు జిల్లా నుంచి రవిశంకర్, హరి ప్రసాద్, నెల్లూరు జిల్లా నుంచి కృష్ణారావు, ఎవి. రామయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రమణ్యం పాల్గొన్నారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు.

13 మంది ఆఫీస్ బేరర్స్‌తో కొత్త కమిటీ ఎన్నిక

మహాసభలలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నెల్లూరు జోన్‌కు 13 మంది ఆఫీస్ బేరర్స్‌తో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కట్టా సుబ్రమణ్యం (నెల్లూరు) అధ్యక్షులుగా డి. మల్లికార్జునరావు(ఒంగోలు), కార్యదర్శిగా ఎస్‌కె.ఖాజావలి(నెల్లూరు), ప్రచార కార్యదర్శిగా ఎన్.వీరాస్వామి ఎన్నికయ్యారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్



మాట్లాడుతున్న జి.రమేష్

49వ డివిజన్‌లో నెలకొని ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ కోరారు. 49వ డివిజన్ సిపిఎం శాఖా సమావేశం స్థానిక జోన్ కార్యాలయంలో కె.గురుస్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లు అయినా డివిజన్లలో ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. విజేత హాస్పటల్ ఎదురు రోడ్డులో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని తెలిపారు. అనేక సార్లు శానిటేషన్ అధికారులకు చెప్పినా చెత్త తొలగించడం లేదని వివరించారు. చెత్త తొలగించకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. వఈ సమావేశంలో 49వ డివిజన్ కార్యదర్శి వేముల మాలకొండయ్య, శాఖ సభ్యులు పాపని సుబ్బారావు, ఎం.శ్రీను, జి.బాలకృష్ణ, ఎం.ఆదినారాయణ, ఎస్‌కె.సుభాని, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతుల సంక్షేమమే లక్ష్యం

- ఎండిహెచ్‌లో 40 శాతం రాయితీ
- హైబ్రిడ్ కూరగాయల విస్తరణ పథకం అమలుకు చర్యలు
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపిచంద్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ఉద్యాన రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి యండమూరి గోపీచంద్ తెలిపారు. సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి మిషన్‌లో పండ్ల తోటల సాగుకు రైతులకు 40 శాతం రాయితీ అందిస్తున్నామన్నారు. హైబ్రీడ్ కూరగాయల విస్తరణ పథకం అమలుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 30 హెక్టార్లలలో పూలతోటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 14 ఫారమ్ పాండ్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను వై.గోపీచంద్ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే..

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉద్యాన రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపట్టాం. వివిధ పథకాలకు లక్ష్యాలు నిర్ధేశించుకొని వాటిని సాధించేందుకు ప్రణాళికలు రచించి కృషి చేస్తున్నాం.

ఎండిహెచ్‌లో రైతులకు 40 శాతం రాయితీ

కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 40 శాతం రాయితీ అందిస్తున్నాం. 514 హెక్టార్‌లలో రూ.85.15 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదం పొందింది. 145.76 హెక్టార్‌లలో లబ్ధిదారులను గుర్తించాం. 75,90 శాతం రాయితీపై 2వ, 3వ సంవత్సరాల పండ్ల తోటల నిర్వహణకు 944.88 హెక్టార్లకు రూ. 53.00 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం.895.77 హెక్టార్‌లలో లబ్దిదారులను గుర్తించాం.

100హెక్టార్లల్లో కూరగాయల విస్తరణ పథకం

హైబ్రిడ్ కూరగాయల విస్తరణ పథకంలో హెక్టారుకు రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నాం. 100 హెక్టార్లలో రూ.20.00 లక్షలకు యాక్షన్ ప్లాన్ ఆమోదించాం. ఇప్పటి వరకు 26.74 హెక్టార్‌లలో లబ్దిదారులను గుర్తించాం. పూల తోటల సాగు పథకంలో హెక్టారుకు రూ.16,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నాం. 30 హెక్టార్లలో రూ.4.80 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం.

ముఖాముఖి

14 ఫారమ్ పాండ్స్ నిర్మాణం

పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 14 ఫారంపాండ్స్ (నీటి కుంటలు) నిర్మాణానికి ఒక్కొక్క దానికి రూ.75,000 చొప్పున రూ.10.50 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. 4 కమ్యూనిటీ ఫారం పాండ్స్ నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున రూ.80 లక్షల కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 7 ఫారంపాండ్స్, 1 కమ్యూనిటీ ఫారంపాండ్ నిర్మాణానికి లబ్దిదారులను గుర్తించాం. రక్షిత వ్యవసాయ పథకంలో 50 శాతం రాయితీపై అధిక విలువ కలిగిన కూరగాయలు, పూల తోటల సంవత్సరం పొడవునా సాగు చేయటానికి 14.20 హెక్టార్లలో రూ.2.19 కోట్లు, దానిమ్మ తోటల్లో రక్షణ వలలకు 75.00 హెక్టార్లలో రూ.24.88 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం. 4.20 హెక్టార్‌లలో లబ్ధిదారులను గుర్తించాం.

మల్చింగ్‌లో 50 శాతం రాయితీ

సమగ్ర నీటి వినియోగంతో పండ్లు, కూరగాయల తోటలు సాగు చేసే రైతులకు మల్చింగ్ పథకంలో 50 శాతం రాయితీ ఇస్తున్నాం. 150 హెక్టార్లలో రూ.24 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 15.40 హెక్టార్‌లలో లబ్ధిదారులను గుర్తించాం. కోత అనంతరం పంట నిల్వ చేసుకొనుటకు 30 ప్యాక్ హౌస్‌లు, 2 శీతల గిడ్డంగులు, 2 రైపనింగ్ ఛాంబర్లు,4 కోల్డ్ రూములు మరియు 15 ప్రత్యామ్నాయ సాంకేతిక పద్ధతులకు రూ.5,86,75,0000 లకు కార్య ప్రణాళిక ఆమోదించి 10 ప్యాక్ హౌస్‌లు, శీతల గిడ్డంగులు, ఒక రైపనింగ్ ఛాంబర్లకు లబ్ధిదారులను ఎంపిక చేశాం. మార్కెటింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో 12 కలెక్షన్ సెంటర్లకు రూ.72 లక్షలకు యాక్షన్ ప్లాన్ ఆమోదించాం.

రైతులకు మినీ ట్రాక్టర్లు అందజేత

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో భాగంగా 50 శాతం రాయితీపై 46 మినీట్రాక్టర్లు, 2 పవర్ టిల్లర్లు, 16 ట్రాక్టర్ మౌంటెడ్ స్పియర్లు, 110 తైవాన్ స్ప్రేయర్లు రూ.49.16 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. 2 పవర్ టిల్లర్లు, 16 తైవాన్ స్ప్రేయర్లు, 14 మిని ట్రాక్టర్లకు లబ్ధిదారులను గుర్తించాం. రైతులకు ఒంగోలు ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో విజ్ఞాన యాత్రల కోసం రూ.26.36 లక్షలతో వివిధ పంటలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించ నున్నాం. రానున్న కాలంలో ఉద్యాన రైతుల సంక్షేమానికి కృషి చేస్తాం.